క్లుప్తంగా

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణంలోని చిన్న వెంకటరెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలోని సరస్వతీ శిశు మందిర్ స్కూల్‌లో ఆదివారం నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తొగోటి రమేష్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కూచిపూడి, భరతనాట్యం, కథక్, డ్రాయింగ్, తెలుగు ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అవకాశాన్ని నల్లగొండ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 9553985143, 9297251309 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

మర్రిగూడ: మండలంలోని కొట్టాల గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ గ్రామ కమిటీని నామాపురం ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా నెర్లకంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గంట అంజయ్య, ప్రధాన కార్యదర్శి జంగాల శేఖర్ గౌడ్, యూత్ అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్, కార్యదర్శి గంట కృష్ణ, నాగరాజులతోపాటు కార్యవర్గ సభ్యులుగా కంబాలపల్లి శంకర్, వీరేశ్, అంజనేయులు, సైదులును కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను, కార్యకర్తలను సన్మానించారు.

'గుత్తా'కు క్షమాపణ చెప్పాలి

నార్కట్‌పల్లి: మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని గుత్తా యువసేన జిల్లా నాయకుడు గుండె రవి డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుత్తా సుఖేందర్‌రెడ్డిని విమర్శించే స్థాయి గాదరి కిషోర్‌కు లేదన్నారు. సమావేశంలో కుక్కల భిక్షం, యాదయ్య, పెర్క రమేష్, గుండె విజయ్, గుండె వింగస్వామి, పెర్క రామలింగయ్య తదితరులు ఉన్నారు.

వాడ వాడలా మేడే నిర్వహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి కార్మిక శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి డి.వెంకటేశ్వర్లు, వి.లెనిన్, గుండె రవి, జాని, యూసుఫ్, మదార్ దస్తగిరి, బుర్రి రాములు, పి.యాదయ్య, నాగరాజు, కొండ రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.


జనార్దన్‌రావుకు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ టూటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్ రావు దశదిన కర్మలో శనివారం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్, ఎన్.భాస్కరరావు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఇతర పార్టీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కటికన్ సత్తయ్య గౌడ్, రామచంద్రనాయక్, పంకజ్ యాదవ్, మాలె శరణ్యారెడ్డి, మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీఐఏ ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడిగా సోమయ్య



త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట గ్రామానికి చెందిన బొజ్జ సోమయ్య సమాచార హక్కు చట్టం ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమయ్య మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదన్నారు. అందరికీ అందుబాటులో బాధ్యతగా ఉంటానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర జంతువుకు రక్షణ కరువు

- కుక్కల దాడిలో, వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్న జింకలు
- సంరక్షణ చర్యలు మరిచిన అధికారులు
- రైతులకు సైతం నష్టమే



దామరభీమనపల్లిలో మృతిచెందిన జింకకు పంచనామా నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)



మర్రిగూడలో గాయపడిన జింకకు చికిత్స అందిస్తున్న వైద్యులు (ఫైల్)

మర్రిగూడ : తెలంగాణ రాష్ట్ర జంతువైన జింకకు రక్షణ కరువైంది.సంబంధిత శాఖ అధికారులు వాటి సంరక్షణకు చొరవ చూపకపోవడంతోనే అంతరించి పోతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదనే ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది. మర్రిగూడ మండలంలో ఖుదాబాక్షపల్లి, వెంకేపల్లి, అజ్జిలాపురం, తిరగండ్లపల్లి, యరగండ్లపల్లి, కొండూరు, మర్రిగూడ, సరంపేట గ్రామాల పరిధిలో దాదాపు 1800 హెక్టార్ల అటవీ భూమి ఉంది. ఈ భూములతో పాటు గుట్టల ప్రాంతాల్లో వన్యప్రాణులు ఆశ్రయం పొందుతున్నాయి. కానీ ఆ జంతువులు నివసించే ప్రాంతాల్లో సరిపడా ఆహారం లభించకపోవడంతో సమీప రైతుల పొలాల్లోకి వస్తున్నాయి.

పెరుగుతున్న మరణాలు

మండలంలోని సరంపేట గ్రామంలో దాదాపుగా 400కు పైగా జింకలు ఉండవచ్చని అధికారుల అంచనా. ప్రతి సంవత్సరం కుక్కల దాడిలో, గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నాయి. అధికారికంగా మరణిస్తున్నట్లు కొంత తెలిసినప్పటికీ అనధికారికంగా అడవుల్లో మరెన్నో మృత్యువాత పడుతున్న వాటికి లెక్కేలేదు. వాటికి ఆహారం, నీరు లభించకపోవడంతో ఇతర ప్రాంతాలకు సంచరిస్తున్న సందర్భంలో వీధికుక్కలు దాడిచేయడం రహదారి వెంట పరిగెడుతున్నప్పుడు గుర్తు తెలియని వాహనాలు ఢీకొనడంతోనే చనిపోతున్నాయని తెలుస్తోంది. జింకలు సంచరిస్తున్న ప్రాంతాల్లో వాటి దాహం తీర్చేందుకు నీరు, ఆహారం అందించేందుకు విరివిగా మొక్కలు నాటడం,, ఆ ప్రాంతాల్లో రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తే ఈ ప్రమాదాలను నివారించవచ్చని సమీప ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.

పంటలకు నష్టం

వానాకాలంలో రైతుల సాగు చేసే పొలాల్లోకి జింకలు గుంపులుగా వెళ్తుండడంతో పంట నష్టం తప్పడం లేదు. తద్వారా రైతులు ఉదయం సమయంలో పొలాల వద్ద ఉంచి చెదరగొట్టినప్పటికీ రాత్రి సమయాల్లో సంచరిస్తే కాపలా ఉండలేక పోతున్నామని వాపోతున్నారు. రాంరెడ్డిపల్లి, సరంపేట, ఇందుర్తి, లెంకలపల్లి, కమ్మగూడ, దామెరభీమనపల్లి గ్రామాల్లోని రైతుల పొలాల్లో, గ్రామ సమీపంలో అరుదుగా సంచరిస్తుంటాయి. జింకల నుంచి పంటలను కాపాడాలని, వాటికి రక్షణ ఏర్పాటు చేయాలని, పలు మార్లు మండల, జిల్లా అటవీశాఖ అధికారులకు మొరపెట్టుకున్నా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం అమలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వన్య ప్రాణులను సంరక్షించాలి



వన్య ప్రాణులను సంరక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్డు ప్రమాదాల్లో, కుక్కల దాడుల్లో జింకలు మృత్యువాత పడడం బాధాకరం. తక్షణమే వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. అధికారులు స్పందించి వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

– మార్నేని అంతయ్య, రైతు, కమ్మగూడ

పంటలను కాపాడాలి



జింకలతోపాటు రైతులు పండిస్తున్న పంటలను కాపాడాలి. ఏ పంటలు సాగు చేసినా జింకలు గుంపులు గుంపులుగా వచ్చి పంట చేలలో తిరుగుతున్నాయి. అధికారులు జింకలకు ప్రత్యేకమైన కంచె ఏర్పాటు చేసి వాటిని ప్రమాదాల నుంచి రక్షించాలి. పలు గ్రామాల రైతులు జిల్లా అధికారులను గతంలో కలిసినా నేటి వరకు స్పందించలేదు.

– నక్క నరసింహ, రైతు, సరంపేట

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

సరంపేట సమీపంలో జింకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, రైతుల పంట పొలాలకు నష్టం వాటిల్లుందని అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాం. ఈ వేసవికాలంలోనే ప్రత్యామ్నాయ లేదా శాశ్వత పరిష్కార మార్గాలు చేపడుతామని తెలిపారు.

– రవీందర్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



గట్టుప్పల్ మండలం అంతంపేటలో ఓటర్లకు స్లిప్పులను అందజేస్తున్న తహసీల్దారు రాములు

చండూరు(గట్టుప్పల్) : ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని గట్టుప్పల్ తహసీల్దారు రాములు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండలం పరిధిలోని అంతంపేట గ్రామంలో ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేశారు. ప్రతి ఓటరుకు సిబ్బంది సిబ్బంది స్లిప్పులను అందజేస్తుందని తెలిపారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

మర్రిగూడ: మండల కేంద్రంతోపాటు కొండూరు గ్రామంలోని ఓటర్లకు బీఎల్‌ఓలు శనివారం ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. స్లిప్‌లు అందనివారు నేరుగా స్థానిక బీఎల్‌ఓలను సంప్రదించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు రమాదేవి, శోభారాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలి



కట్టంగూర్ : మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

కట్టంగూర్ : వాడవాడలా ఎర్ర జెండాలను ఎగురవేసి మేడే వారోత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం కట్టంగూర్‌లో నిర్వహించిన మండల మేడే సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కాలని చూస్తుందన్నారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పాడిచేటి సులోచన, కో కన్వీనర్‌గా గుడుగుంట్ల రామకృష్ణ, కట్ట బక్కయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పెంజర్ల సైదులు, గుడుగుంట్ల రామకృష్ణ, తవిటి వెంకటమ్మ, సులోచన, శోభారాణి ఉన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

నకిరేకల్ : మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వంటిపాక వెంకటేశ్వర్లు కోరారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తాడ్వాయి రాములు, సూరారపు వీరయ్య, మల్సూర్, కృష్ణ, యుసుఫ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు

మర్రిగూడ : మర్రిగూడ మండల వ్యాప్తంగా 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు రూట్ మ్యాప్‌లకుగాను నలుగురు సెక్టార్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 30,086 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆయన వెంట డీటీ జూటూరు తారకరామన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్ఐ బషీర్ అలీ, రమేష్, మధు, వెంకటేష్ ఉన్నారు.

పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మర్రిగూడ : పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మర్రిగూడ మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో మునుగోడులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో గట్టుప్పల మండల పరిధిలోని అంతంపేట ఎంపీటీసీ నేనావత్ బంతిలాల్, మాజీ దళితబంధు డైరెక్టర్ లపంగి నరసింహ, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ రజాక్‌లకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, ఎంపీటీసీలు గండికోట రాజమణిహరికృష్ణ, సిలివేరు విష్ణు, నాయకులు పాక నగేష్‌యాదవ్, కంచుకట్ల సంపత్, మాదగోని జంగయ్య, గంట కృష్ణ, ఐతరాజు స్వామి, శ్రీశైలం, సురిగి ముత్తయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



కట్టంగూర్ : అయిటిపాములలో కేంద్ర పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న గోలి ప్రభాకర్

కట్టంగూర్ : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని పెరిందేవిగూడెం గ్రామంలో ఆయన ఇంటింటికి తిరిగి నర్సయ్య గౌడ్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఉబ్బని వెంకన్న, గోలి మహేశ్వరి ఉన్నారు.

ఇంటింటి ప్రచారం

నకిరేకల్ : బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో ఆ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి వంగురి సైదులు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

కేతేపల్లి: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు శనివారం మండలంలోని గుడివాడ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇంచార్జి సాయన్న, మండల అధ్యక్షులు రాచకొండ గోపి, నాయకులు తర్నోజు నర్సింహ్మాచారి, నాయకులు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, పగిళ్ల దామోదర్, సుంకరి మధుకర్, మంటిపల్లి మల్లేష్, శ్రీకాంత్, వెంకటాచారి, జానయ్య పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఇంటింటి ప్రచారం

నల్లగొండ రూరల్: బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి ఆదివారం నల్లగొండ మండలంలోని కొత్తపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోగరి అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచారంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రామరాజు పాల్గొంటారని తెలిపారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం





హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ అలోక్ అరాధేకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ



ఛాయ సోమేశ్వర ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ అలోక్ అరాధేను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

విధుల్లో అలసత్వం వహించొద్దు

మిర్యాలగూడ : ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ హెచ్చరించారు. శనివారం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలోని వేములపల్లి, దామరచర్ల మండలాల్లో, మిర్యాలగూడ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను, శెట్టిపాలెంలోని చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. బీఎల్‌ఓలు ప్రతి ఒక్క ఓటరుకు స్లిప్‌లను అందజేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు హరిబాబు, శ్రీనివాస్ శర్మ, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయిస్తా..

- సీపీఎం అభ్యర్థి జహంగీర్



చిట్యాల : జహంగీర్‌కు రూ.10వేల నగదు అందజేస్తున్న బొంతల నర్సిరెడ్డి



చండూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల: తనను భువనగిరి పార్లమెంటు సభ్యుడిగా గెలిపిస్తే నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ తెలిపారు. చిట్యాల మండలంలోని నేరడ, వెలిమినేడు, చిట్యాల మున్సిపాలిటీలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. వెలిమినేడులో బొంతల నర్సిరెడ్డి పది వేల రూపాయలను అభ్యర్థి జహంగీర్‌కు ఎన్నికల ప్రచారానికి గాను అందజేశారు. అనంతరం ఆయన చిట్యాలలో విలేకరులతోపాల్గొన్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం, నక్కలగండి , బస్వాపూర్, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలతో పాటు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తేందుకు గాను నిరంతరం పనిచేస్తానన్నారు. సమావేశంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, అరుణజ్యోతి, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ, మేక అశోక్‌రెడ్డి, అచ్చాలు, అర్రూరీ శ్రీను, దేశబోయిన నర్సింహ పాల్గొన్నారు.

పనిచేసే వారికి ఓటు వేయాలి

నార్కట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే వారిని గెలిపించాలని భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్ అన్నారు. శనివారం మండలంలోని ఏపీ లింగోటం, తొండల్‌వాయి , నార్కట్‌పల్లి, ఔరవాణి, ఎల్లారెడ్డిగూడెం తదితర గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు , చెరుకు పెద్దులు, చింతపల్లి బయన్న, కల్లం మహేశ్వరం, రేడిపల్లి రఘు, కొప్పు శ్రవణ్, ఆమనగంటి ఐలయ్య, మంద గోపాల్ ఉన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

చండూరు : పేద ప్రజల పక్షాన పోరాడే భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, చిట్టి మల్ల లింగయ్య, గౌసియా బేగం, నరసింహ పాల్గొన్నారు.

సీపీఎం ఇంటింటి ప్రచారం

నకిరేకల్ : సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్ పట్టణంలోని 18 వ వార్డులో శనివారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకురాలు కందాల ప్రమీల మాట్లాడుతూ సీపీఎం అభ్యర్థి జహంగీర్ ఈనెల 30న నకిరేకల్‌లో రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వంటిపాక వేంకటేశ్వర్లు, నాయకులు సాకుంట్ల నర్సింహ, ఏర్పుల తాజేశ్వర్, ముశం అశోక్, జమదగ్ని, అంజయ్య పాల్గొన్నారు.


కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారెడ్డి

చండూరు(గట్టుప్పల్) : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని పార్లమెంట్ కో ఆర్డినేటర్ బొజ్జ సంధ్యారెడ్డి అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాయకులు జగన్నాథం, దండు యాదగిరి రెడ్డి, సామల యాదయ్య, బీమగాని మల్లేశం, ఆది, నామని బుచ్చయ్య ఉన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

శాలిగౌరారం: బీఆర్‌ఎస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయం ముందు ఉన్న దిమ్మెపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు.కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు కట్ట వెంకట్ రెడ్డి, మామిడి సర్వయ్య, గంట శంకర్, జేరిపోతుల చంద్రమౌళి, గుజిలాల్ శేఖర్‌బాబు, దాసరి నతానియేల్, వెంకన్న, దుబ్బ వెంకన్న, పాక యాదయ్య, బాకి వెంకటయ్య, శ్రీనివాసులు, వీరబాబు పాల్గొన్నారు.

రేపు రవీంద్రభారతిలో పుస్తకావిష్కరణ సభ



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న సాహితీ మేఖల సభ్యులు పున్న అంజయ్య తదితరులు

చండూరు : చండూరు సాహితీ మేఖల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో సాహితీ మేఖల పలు పుస్తకాల ఆవిష్కరణ సభ ఏర్పాటు చేసిందని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య తెలిపారు. సంస్థ సభ్యులైన సుందర దేశికులు రచించిన సుందర రామం అనే పద్యగేయకావ్యం, వరదదేశికులు రచించిన శ్రీకృష్ణామృతం, వరదానందలహరి పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుందని వివరించారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శనివారం చండూరులో సాహితీ మేఖల ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య ,ప్రధాన వ్యవహర్త మంచుకొండ చిన్న భిక్షమయ్య, సుధీర్ బాబు విడుదల చేశారు.

చట్టపరమైన భద్రత లేక బీసీ వర్గాలపై దాడులు



మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి రవి

నల్లగొండ రూరల్: చట్టపరమైన భద్రత లేక పోవడంతోనే బీసీ సామాజిక వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని నల్లగొండ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి రవి రమాదేవి అన్నారు. శనివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గాల వారిని కులం పేరుతో దూషిస్తూ దాడులు చేస్తున్నారని, భౌతిక దాడులను అడ్డుకునేందుకు బీసీలు ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి గడగోజు విజయ్, హరిశంకర్, శ్రీశైలం, మాదగోని శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.